మెరక రైతులకు పోల'వరం'

- కాలువలో పుష్కలంగా చేరిన నీరు
- మెరక భూములు సస్యశ్యామలం
- వైఎస్సార్ కృషితోనని అన్నదాతల ఆనందం

నక్కపల్లి: పోలవరం కాలువ నిర్మాణం ఇప్పటికి 60 శాతమే పూర్తయింది. అయినప్పటికీ ఈ కాలువ నీరు మెట్టు భూములను సస్యశ్యామలం చేస్తోంది. మహానేత వైఎస్ రాజశేఖర్‌రెడ్డి కృషి వల్ల బీడు భూముల్లో అన్నదాతలు నాలుగు తిండి గింజలు పండించే పరిస్థితి ఏర్పడింది. ఖరీఫ్‌లోనే కాకుండా రబీలోనూ పోలవరం కాలువకు ఇరువైపులా భూముల్లో వరితోపాటు అపరాలు, కూరగాయలు, ఉద్యానవన పంటలు పండిస్తున్నారు. ప్రతికూల వాతావరణ పరిస్థితుల్లోనూ కాలువ ఆయకట్టు రైతులను ఆదుకుంటోంది.

పోలవరం కాలువ నిర్మాణం ఉమ్మడి విశాఖ జిల్లా ప్రజల చిరకాల వాంఛ. మహానేత వైఎస్సార్ 2003లో పాదయాత్ర చేపట్టినప్పుడు ఈ ప్రాంతంలో పోలవరం కాలువ నిర్మాణ ఆవశ్యకతను గుర్తించారు. 2004లో అధికారంలోకి వచ్చిన తర్వాత రాజీవ్ పల్లెబాట కార్యక్రమంలో ఈ ప్రాంత పర్యటనకు వచ్చినప్పుడు త్వరలోనే ప్రాజెక్టు నిర్మాణం పనులు, కాలువ తవ్వకాలు ప్రారంభిస్తామని వైఎస్ హామీ ఇచ్చారు. ఆయన చెప్పటినట్టుగానే 2006లో



కాలువలో నీటిని పైపుల ద్వారా దిగువ ప్రాంతాలకు మళ్లించుకుంటున్న దృశ్యం



నిర్మాణంలో ఉన్న కాలువలో పుష్కలంగా చేరిన వర్షపునీరు

విశాఖ జిల్లాలో పాయకరావుపేట నుంచి తాళ్లపాలెం వరకు 5, 6, 7 ప్యాకేజీ కింద ఎడమ కాలువ నిర్మాణ పనులు శరవేగంగా ప్రారంభమయ్యాయి. ప్రాజెక్టు నిర్మాణంలో జాప్యం జరుగుతున్నప్పటికీ కాలువ తవ్వకాలు చేపట్టడం వల్ల కాలువల్లో పుష్కలంగా నీరు చేరింది. ఒకప్పుడు అపరాల పంటకే పరిమితమైన మెట్టు భూముల్లో పుష్కర కాలం నుంచి రైతులు వరి సాగు చేస్తున్నారు. ఈ ఖరీఫ్ సీజన్‌లో కూడా వరినాట్లు పూర్తయ్యాయి. ఖరీఫ్‌లో మెరక గ్రామాల్లో వరి పొలాలకు నీరు అందుతుందంటే పోలవరం కాలువ పుణ్యమేనని రైతులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. పోలవరం కాలువలో చేరిన నీరు ఖరీఫ్ సీజన్‌కు పూర్తిగా సరిపోతోంది.

4 మండలాలకు పోలవరం కాలువ నీరు..

పాయకరావుపేట, నక్కపల్లి, ఎస్.రాయవరం, యలమంచిలి మండలాల్లో పోలవరం కాలువకు ఇరువైపులా 3 వేల ఎకరాలు మెట్టు భూములు ఉన్నాయి. ఎగువ ప్రాంతాల్లో కురిసిన వర్షపునీటిపై ఆధారపడి చెరువుల ఆయకట్టు మరో 7 వేల ఎకరాలు ఉంది. వీటిలో 6 వేల ఎకరాల్లో వరి సాగు చేస్తుంటారు. పీఎల్‌పురం, సీతారామపురం, దేవవరం, చినరామభద్రపురం, ఒడ్డిమెట్టు, ఉద్దండపురం, గొడిచర్ల, నామవరం, రమణయ్యపేట, చినదొడ్డిగల్లు, గుల్లిపాడు, ముకుందరాజుపేట, జగన్నాథపురం, చీడిక, దోసలపాడు, పెదదొడ్డిగల్లు, సీతంపాలెం, రామకృష్ణాపురం, చినగుమ్ములూరు, దార్లపూడి, రామయ్యపట్నం, చెల్లాపురం, కొత్తూరు, తదితర గ్రామాల్లో రైతులు పోలవరం కాలువ నీటిని ఉపయోగించుకునే అవకాశముంది.



కాలువకు ఇరువైపులా వరి సాగుచేస్తున్న రైతులు

సాగు నీటికి ఢోకా ఉండదు..

కాలువ పనులు పునః ప్రారంభమైన తర్వాత దిగువ ప్రాంతాలకు వచ్చే నీటి మార్గాలను కాంట్రాక్టర్లు మూసి వేశారు. దీంతో నీరు చెరువుల్లోకి చేరకపోవడంతో రైతులు ఇరిగేషన్ అధికారులు, కాంట్రాక్టర్లను కలిసి సమస్య వివరించడంతో కాలువ నీటిని ఉపయోగించుకునేందుకు ఇరిగేషన్ వారు అంగీకరించారు. దీంతో రైతులు పిల్ల కాలువలను ఏర్పాటు చేసుకోవడం, ఇంజిన్ల సాయంతో నీటిని తోడుకుంటూ వరి పంటకు ఉపయోగించుకుంటున్నారు. అరటి, అపరాలు, కూరగాయల పంటలకు సైతం ఇదే నీటిని వినియోగిస్తున్నామని రైతులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు. వర్షాలు పడకపోయినా ఖరీఫ్‌లో కాలువకు ఇరువైపులా సాగు చేసిన భూములకు నీటికి ఢోకా ఉండదని ధీమా వ్యక్తం చేస్తున్నారు. కాలువ పనులు 60 శాతం పూర్తయ్యాయి. దిగువ ప్రాంతాలకు కూడా స్లూయిస్‌లు ఏర్పాటు చేసి నీటి మార్గాలను ఏర్పాటు చేస్తే పల్లం భూములకు కూడా పోలవరం కాలువ అందుబాటులోకి వస్తుందని రైతులు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికే ఒక విడత నీటిని ఉపయోగించుకుని నాట్లు పూర్తి చేసిన రైతులు ఎరువులు, పురుగు మందులు వేసి త్వరలోనే రెండో విడత నీటిని ఉపయోగించుకునేందుకు సిద్ధపడుతున్నారు.

కాలువ నీటితో పంటలు



మహానేత వైఎస్ పుణ్యమా అని పోలవరం కాలువ నిర్మాణం 60 శాతం పూర్తయింది. ఈ కాలువలో చేరిన నీటిని ఉపయోగించి మెట్టు భూముల్లో వరి, కూరగాయలు, అపరాలు సాగు చేస్తున్నాం. ఇంజిన్ల సాయంతో నీటిని తోడి పంటలకు ఉపయోగిస్తున్నాం. 12 ఏళ్ల నుంచి కాలువకు ఎగువ దిగువ ప్రాంతాల్లో భూములు కలిగిన రైతులంతా కాలువలో నీటిని ఉపయోగించుకుని సాగు చేసుకుంటున్నాం. ప్రాజెక్టు పనులు పూర్తికాకపోయినా కాలువ నిర్మాణం ద్వారా అందుబాటులోకి వచ్చిన నీటిని ఉపయోగించుకుని అన్నదాతలు తిండిగింజలు పండించే అవకాశం ఏర్పడింది.

– గొర్ల గోవిందు, రైతు, సీతం పాలెం

అడ్డుగా మట్టి వేయడంతో రాని నీరు



రాజశేఖర్‌రెడ్డి తవ్వించిన పోలవరం కాలువ మా మెరక గ్రామాల్లో ఎంతో మంది రైతులకు నీరు అందిస్తోంది. ధైర్యంగా వరి పండించుకునే పరిస్థితి ఏర్పడింది. గతంలో వర్షాలపైనే ఆధారపడే వాళ్లం. ఇప్పుడా పరిస్థితి లేదు. కాలువలో ఏడాదంతా నిండుగా నీరు ఉంటోంది. కొన్ని చోట్ల కాలువలో నీరు కిందకు రాకుండా అడ్డుగా మట్టి వేయడం వల్ల చెరువుల్లోకి నీరు రావడం లేదు. దీన్ని అధికారుల దృష్టికి తీసుకెళ్లాం. పిల్లకాలువలు ఏర్పాటు చేసి సీజన్‌లో నీటి సరఫరా చేస్తే రైతుల ధీమాగా పంటలు పండించుకునే అవకాశం ఉంది.

– నారపురెడ్డి కుమారి, రైతు జగన్నాథపురం

క్లుప్తంగా

సత్తెమ్మతల్లి గుడికి విరాళం



సత్తెమ్మతల్లి గుడికి విరాళం అందజేస్తున్న శివ

మునగపాక: స్థానిక చెరువు కాలువ సంఘ పరిధిలో సత్తెమ్మతల్లి ఆలయ గుడి నిర్మాణ పనులు చురుగ్గా సాగుతున్నాయి. ఇందులో భాగంగా మునగపాకకు చెందిన మళ్ల శివ ఆదివారం తనవంతు సాయంగా ఆలయ అభివృద్ధికి రూ.10,116 ప్రకటించారు. మొదటి విడతగా రూ.5116 కమిటీ సభ్యులకు ఆదివారం అందించారు. కార్యక్రమంలో కర్రి రామజోగినాయుడు, బొడ్డేడ రామునాయుడు, ఆడారి జగ్గారావు, వెలగా వెంకటప్పారావు, వెలగా ధర్మసూరి, వెలగా శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

హిందూ ధర్మ పరిరక్షణకు కృషి



మాట్లాడుతున్న విశ్రాంత శాస్త్రవేత్త శివాజీ

మునగపాక: ప్రతి ఒక్కరూ హిందూ ధర్మ పరిరక్షణకు పాటుపడాలని ఆర్ఎస్ఎస్ ప్రతినిధి, విశ్రాంత శాస్త్రవేత్త శివాజీ కోరారు. స్థానిక నందీశ్వర ప్రాంగణంలో ఆదివారం రాత్రి ఆర్ఎస్ఎస్ శతాబ్ది ఉత్సవాలను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఆర్ఎస్ఎస్ సిద్ధాంతాలను, ఆచారాలను అమలు చేయాలన్నారు. హిందూ మతాన్ని రక్షించడం కోసం ఆర్ఎస్ఎస్ స్థాపించారన్నారు. 60 వేల సంఘాలు ప్రపంచంలో ఉన్నాయన్నారు. తొలుత ఆర్ఎస్ఎస్ శతాబ్ది ఉత్సవాల్లో భాగంగా పిల్లలు ప్రదర్శించిన విన్యాసాలు అందరినీ ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో విశ్రాంత హెచ్ఎం బనాల అప్పారావు, డాక్టర్ బద్దెం సూర్యనారాయణ, మళ్ల కాలేశ్వరరావు, భాస్కరరావు, వాసు, వేగి అప్పలనాయుడు తదితరులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరా నిలిపివేత

యలమంచిలి రూరల్: స్థానిక విద్యుత్ సెక్షన్ పరిధిలో ఆర్‌డీఎస్ఎస్ పనుల కారణంగా సోమవారం కొన్ని ప్రాంతాల్లో సరఫరా నిలిపివేయనున్నట్టు అనకాపల్లి ఏపీఈపీడీసీఎల్ ఈఈ కే రాజశేఖర్ తెలిపారు. పెదపల్లి 33/11కేవీ పరిధిలో కొక్కిరాపల్లి, చిన షేక్కిళపాలెం, పెద షేక్కిళపాలెం గ్రామాలకు ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు, రాంబిల్లి 11 కేవీ ఉప కేంద్రం పరిధిలో యలమంచిలి పట్టణం, కొత్త ఎర్రవరం, సోమలింగపాలెం, కట్టుపాలెం, రామారాయుడుపాలెం, కొత్తపాలెం ప్రాంతాల్లో వ్యవసాయ విద్యుత్ సర్వీసులకు ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేత ఉంటుందని తెలిపారు. వినియోగదారులు ఈ విషయాన్ని గమనించి తగు ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేసుకోవాలని సూచించారు.

మొల్లోడుగెడ్డలో నిలిచిన రసాయన వ్యర్థాలు



రసాయన వ్యర్థ జలాలతో రంగు మారిన మొల్లోడుగెడ్డ నీరు

పరవాడ: మండలంలోని భర్నికం సమీపంలో ఉన్న మొల్లోడిగెడ్డలో నిలిచిన వ్యర్థ రసాయన జలాలను బయటకు తోడించాలని సిటు రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు గనిశెట్టి సత్యనారాయణ డిమాండ్ చేశారు. ఫార్మా యాజమాన్యాలు ఇష్టానుసారంగా రసాయన వ్యర్థ జలాలను గెడ్డలోకి విడుదల చేయడంతో భూగర్భ జలాలు కలుషితమవుతున్నాయని ఆరోపించారు. దీంతో వ్యవసాయ పంటలు దెబ్బతింటున్నాయన్నారు. ఆదివారం ఆయన మొల్లోడి గెడ్డను పరిశీలించారు. అనంతరం మాట్లాడుతూ గెడ్డలో నిలిచిన రసాయన వ్యర్థ జలాలు విపరీతమైన దుర్వాసన వెదజల్లుతున్నాయని ఫలితంగా రహదారి ప్రయాణికులు ముక్కు మూసుకుని రాకపోకలు సాగించాల్సిన పరిస్థితి దాపురించిందన్నారు. దీనిపై పీసీబీ అధికారులకు ఫిర్యాదు చేసినా తూతూ మంత్రంగా చర్యలు చేపట్టి చేతులు దులిపేసుకుంటున్నారని ఆక్షేపించారు. మొల్లోడిగెడ్డ ప్రాంతాన్ని రాష్ట్ర పీసీబీ చైర్మన్ కృష్ణయ్య పరిశీలించి వెళ్లారని, అయినా ఎలాంటి చర్యలు చేపట్టలేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి చర్యలు చేపట్టాలని, లేకుంటే పెద్ద ఎత్తున ఆందోళనకు దిగుతామని గనిశెట్టి హెచ్చరించారు.

పొంగిన గెడ్డలు

మాడుగుల రూరల్: ఇటీవల కురుస్తున్న వర్షాలకు మండలంలో తాచేరు, పాలగెడ్డ, చింత గెడ్డ, శారద, పెద్దేరు నదులు పొంగి ప్రవహిస్తున్నాయి. దీంతో నది పరివాహక ప్రాంతంలో వరి, ఇతర పంటలు నీటి ముంపునకు గురవుతున్నాయి. వరదగట్లు కోతకు గురవుతున్నాయి. తాచేరు ఉధృతంగా ప్రవహిస్తోంది.



ఎస్ఈసీ సభ్యుడు గోవింద్‌కు సత్కారం



ఎస్ఈసీ సభ్యుడు గోవింద్‌ను సత్కరిస్తున్న పార్లమెంట్ నియోజకవర్గ సమన్వయకర్త ప్రసాద్

మునగపాక: పార్టీలో కష్టపడి పనిచేసే వారికి తగిన గుర్తింపు ఉంటుందని వైఎస్సార్‌సీపీ అనకాపల్లి పార్లమెంట్ నియోజకవర్గ సమన్వయకర్త బొడ్డేడ ప్రసాద్ పేర్కొన్నారు. పార్టీ రాష్ట్ర ఎస్ఈసీ సభ్యునిగా యలమంచిలి ఎంపీపీ బోదెపు గోవింద్ నియమితులైన సంగతి తెలిసిందే. ఆదివారం మునగపాకలోని బొడ్డేడ క్యాంప్ కార్యాలయంలో గోవింద్‌ను ప్రసాద్ శాలువాతో సత్కరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ పదవులు పొందిన ప్రతి ఒక్కరూ కష్టపడి పనిచేసి పార్టీ బలోపేతంతోపాటు రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ విజయం కోసం శ్రమించాలన్నారు. ప్రభుత్వ వైఫల్యాలను ప్రజల్లోకి తీసుకువెళ్లాలని కోరారు. కార్యక్రమంలో పార్టీ నేతలు కాండ్రేగుల జగన్, శ్రీపతి రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

హెడ్‌కానిస్టేబుల్ నిజాయితీ



బాధితుడి బ్యాగ్‌ను అందిస్తున్న హెచ్‌సీ స్వామి

పెందుర్తి: వేపగుంట ప్రాంతానికి చెందిన దొంతుకూరి వెంకటసత్యనారాయణమూర్తి ఈ నెల 3న తన ద్విచక్ర వాహనంపై పాయకరావుపేట నుంచి స్వగ్రామానికి వస్తుండగా మార్గమధ్యలో నగదు, గృహోపకరణాలతో కూడిన బ్యాగ్ జారిపోయింది. అదే మార్గంలో వస్తున్న పెందుర్తి పోలీస్ స్టేషన్‌లో హెడ్‌కానిస్టేబుల్‌గా పనిచేస్తున్న డీకేవీ స్వామి ఆ బ్యాగ్‌ను గుర్తించారు. అందులో ఉన్న అడ్రస్ ఆధారంగా సదరు వ్యక్తిని స్టేషన్‌కు పిలిపించి బ్యాగులో ఉన్న రూ.3,600 నగదు, గృహోపకరణాలను ఆదివారం అందించారు. పోయిన నగదు బ్యాగ్ అందించిన హెడ్‌కానిస్టేబుల్ స్వామిని కృతజ్ఞతలు తెలిపారు. హెడ్‌కానిస్టేబుల్ స్వామిని పోలీసు ఉన్నతాధికారులు అభినందించారు.

సీపీఎం నేతల గృహ నిర్బంధాలపై నిరసన



కొత్తపట్నం తీరంలో నినాదాలు చేస్తున్న సీపీఎం నాయకులు

రాంబిల్లి(అచ్యుతాపురం): రాంబిల్లి మండలం కొత్తపట్నం తీరంలో సీపీఎం ఆధ్వర్యంలో ఆ పార్టీ నాయకులు ఆదివారం నిరసన తెలిపారు. నక్కపల్లి మండలంలో బల్క్ డ్రగ్ పార్కుకు వ్యతిరేకంగా మత్స్యకారులు చేపడుతున్న దీక్షలకు మద్దతు పలుకుతున్నారనే నెపంతో పోలీసులు సీపీఎం నాయకులను గృహ నిర్బంధం చేయడాన్ని ఖండిస్తూ నిరసన తెలిపారు. ఈ సందర్భంగా సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యుడు ఆర్. శంకర్‌రావు, మండల కార్యదర్శి జి.దేవుడునాయుడు మాట్లాడుతూ సముద్ర తీర ప్రాంతాన్ని విషతుల్యం చేసే బల్క్‌డ్రగ్ పార్కును నిలిపివేయాలన్నారు. దీనికి వ్యతిరేకంగా చేస్తున్న ఉద్యమాలను అక్రమ అరెస్టులతో అడ్డుకోలేరని పేర్కొన్నారు. ప్రభుత్వానికి చేతనైతే ఎన్నికల హామీలను నెరవేర్చాలని డిమాండ్ చేశారు. అక్రమ నిర్బంధాలను ఆపకుంటే తీవ్ర ప్రతిఘటన తప్పదని హెచ్చరించారు. కార్యక్రమంలో సీపీఎం నాయకులు నారాయణరావు, రామకృష్ణ, ధోని కాసియా, వై.రాము, సి.అప్పలరాజు, రమణ, శివాజీ, వరలక్ష్మి, మంగతాయారు, లక్ష్మి, రాజేశ్వరి తదితరులు పాల్గొన్నారు.

అపూర్వ కలయిక



పాఠశాలలో కలుసుకున్న పూర్వపు విద్యార్థులు

కె.కోటపాడు : స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 2001–02లో టెన్త్ చదివిన విద్యార్థులు ఆదివారం అదే పాఠశాలలో ఆత్మీయంగా కలుసుకున్నారు. పాఠశాల చదువు పూర్తయిన 23 ఏళ్ల తరువాత అంతా కలుసుకోవడంతో వారి ఆనందానికి అవధులు లేకుండా పోయింది. నాడు చదువు చెప్పిన గురువులను ఈ కార్యక్రమానికి ఆహ్వానించి ఘనంగా సన్మానించారు. పూర్వ ఉపాధ్యాయులు స్వర్ణలత, తులసి, పద్మజ, కృష్ణకుమారి, కులయ్యతో పాటు పూర్వపు విద్యార్థులు కోలా మహేష్, ప్రవీణ్, ఎర్రినాయుడు, కండిపల్లి రమణ తదితరులు పాల్గొన్నారు.

13 నుంచి అయ్యప్పభక్తులకు భిక్ష



మాట్లాడుతున్న అయ్యప్పస్వామి ఆలయ కమిటీ ప్రతినిధి ఉమేష్

మునగపాక: స్థానిక అయ్యప్పస్వామి ఆలయ ప్రాంగణంలో ఈ నెల 13 నుంచి భక్తుల సౌకర్యార్థం భిక్ష కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు కమిటీ ప్రతినిధి పెంటకోట ఉమేష్ తెలిపారు. ఆదివారం ఆలయ ప్రాంగణంలో కమిటీ సభ్యులు స్థానిక పెద్దలతో సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ నాలుగు సంవత్సరాలుగా ఆలయ ప్రాంగణంలో భక్తుల సౌకర్యార్థం మధ్యాహ్నం భిక్ష నిర్వహిస్తూ వస్తున్నామన్నారు. ఈ ఏడాది కూడా అందరి సహకారంతో 41 రోజుల పాటు భిక్ష సదుపాయం కొనసాగించేందుకు నిర్ణయించామన్నారు. దీనికి విరాళాలు అందజేయాలని కోరారు. సర్పంచ్ దిమ్మల అప్పారావు, వేగి లక్ష్మణరావు, డాక్టర్ బద్దెం సూర్యనారాయణ, కాండ్రేగుల జగ్గారావు, ఆడారి అచ్చియ్యనాయుడు, టెక్కలి పరశురామ్, విల్లూరి నూకనరసింగరావు, ఆడారి కాశీబాబు, డొక్కా నాగభూషణం, జల్లేపల్లి కిష్టప్ప, కేవీఎస్ అప్పారావు, పెంటకోట శ్రీనివాసరావు, వెలగా రామకృష్ణ, వెలగా మురళి తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా గ్యార్వీ షరీఫ్ వేడుకలు



కోటవురట్లలో సందల్ ఊరేగింపు చేస్తున్న ముస్లిం యువకులు



గుర్రాలకు చందనం పూసి అలంకరించి ఊరేగిస్తున్న దృశ్యం



విద్యుద్దీపాలంకరణతో మసీదులు

కోటవురట్ల/నక్కపల్లి: గ్యార్వీ షరీఫ్ వేడుకలు ఘనంగా జరిగాయి. ఉస్మాన్ ఘని, నవజవాన్ యూత్ ఆధ్వర్యంలో కోటవురట్ల ముస్లిం కాలనీలో శనివారం ప్రారంభమైన ఈ వేడుకలు ఆదివారం కూడా కొనసాగాయి. మసీదు ఉస్మాన్ ఘని నుంచి సందల్ ఊరేగింపు నిర్వహించారు. కమిటీ సభ్యులు, యువకులు గ్రామ వీధుల్లో ఉత్సాహంగా శాంతి ర్యాలీ చేశారు. అనంతరం గౌస్ పాక్ నిషానీ వద్ద సలాతు సలాం, ఫాతెహా, దురుద్ నిర్వహించి సర్కార్ గౌస్ పాక్ జెండాను ఆవిష్కరించారు. నక్కపల్లి మండలం పెదబోదిగల్లం, రామకృష్ణాపురం, అప్పలపాయకరావుపేట, చిన బోదిగల్లం, పెద దొడ్డిగల్లు గ్రామాల్లో మసీదులను సర్వాంగ సుందరంగా విద్యుద్దీపాలతో అలంకరించారు. గుర్రాలను సైతం అలంకరించి వీధుల్లో ఊరేగించారు. వాటికి చందనం పూసి ఐదు గ్రామాల ముస్లింలంతా ఒకచోట చేరి ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. గాజువాక, విశాఖపట్నం తదితర ప్రాంతాల్లో ఉద్యోగ, వ్యాపార రీత్యా స్థిరపడిన వారంతా స్వగ్రామాలకు చేరుకుని పండగ జరుపుకున్నారు.

అధ్వాన రోడ్డుతో అవస్థలు



అధ్వానంగా మారిన సోమునాయుడు పాలెం రోడ్డు

పరవాడ: భారీ వాహనాల రాకపోకలతో ఎన్టీపీసీ–సోమునాయుడుపాలెం రోడ్డు అధ్వానంగా మారింది. రహదారిలో నిత్యం రాకపోకలు సాగిస్తున్న బొగ్గు లారీలతో రోడ్డు గోతులమయంగా మారిన నేపథ్యంలో అనేక గ్రామాల ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. రోడ్డులో ఏర్పడిన భారీ గుంతలతో వర్షం కురిసినపుడు, రాత్రి సమయంలో రాకపోకలు సాగించే ప్రయాణికులు ప్రమాదాల బారిన పడుతున్నారు. అధిక బరువుతో రాకపోకలు సాగిస్తున్న బొగ్గు లారీల కారణంగా గోతులు మరింత పెద్దవిగా మారుతున్నాయి. ఎన్టీపీసీ, ఫార్మాసిటీ, హిందూజా పరిశ్రమల్లో పనిచేసే ఉద్యోగులు, కార్మికులు గోతుల కారణంగా తరచూ ప్రమాదాలకు గురవుతున్నట్లు వాపోతున్నారు. తమ ఇబ్బందుల్ని గుర్తించి రోడ్డు మరమ్మతులకు చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

ఘనంగా శూలాల మహోత్సవం



భారీ శూలం ధరించిన భక్తుడు



దుర్గాదేవి నిమజ్జనంలో భాగంగా తరలివచ్చిన భక్తులు

మునగపాక: మండలంలోని వాడ్రాపల్లిలో దుర్గాదేవి శూలాల మహోత్సవం శనివారం రాత్రి ఘనంగా నిర్వహించారు. దుర్గాదేవి మాలలు ధరించిన పలువురు భక్తులు శూలాలు ధరించి అగ్నిగుండం తొక్కారు. శూలాలతో భక్తులు గ్రామంలో ఊరేగింపుగా బయలుదేరి అమ్మవారి నిమజ్జన కార్యక్రమంలో పాల్గొన్నారు. శూలాలతోపాటు అగ్నిగుండం తొక్కే కార్యక్రమాన్ని తిలకించేందుకు గ్రామస్తులు భారీగా తరలివచ్చారు. జై దుర్గా నామస్మరణతో వాడ్రాపల్లి మార్మోగింది. గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

ఆటల పోటీలు ప్రారంభం



తాండవలో ఆటలు పోటీలు ప్రారంభిస్తున్న నాతవరం ఎస్ఐ తారకేశ్వరరావు

నాతవరం: తాండవలో ఈనెల 7న జరగనున్న నల్ల కొండమ్మతల్లి పండగ సందర్భంగా నిర్వహించే ఆటల పోటీలను ఎస్ఐ వై.తారకేశ్వరరావు ఆదివారం ప్రారంభించారు. గ్రామ దేవతల పండగల సందర్భంగా అసాంఘిక కార్యక్రమాలకు దూరంగా ఉండి, ఇలాంటి టోర్నమెంట్లు ఏర్పాటు చేసుకోవడం మంచి పరిణామమన్నారు.

బాణసంచా అక్రమ తయారీదారుడి అరెస్ట్



పోలీసులు స్వాధీనం చేసుకున్న మందుగుండు సామగ్రి



నిందితుడితో పెందుర్తి పోలీసు సిబ్బంది

పెందుర్తి: మండలంలోని పొర్లుపాలెం రెవెన్యూ పరిధి ఆర్ఆర్ వెంకటాపురం శివారు మేహాద్రిగెడ్డ సమీపంలోని కంపర వారి కల్లాలు వద్ద రేకుల షెడ్డులో అక్రమంగా మందుగుండు సామగ్రి తయారు చేస్తున్న కొండవలస రవికుమార్‌ను పోలీసులు అరెస్ట్ చేశారు. పెందుర్తి ఎస్ఐ ఎస్‌వీ భాస్కరరావు తెలిపిన వివరాలు. గోపాలపట్నం దరి పద్మనాభనగర్‌కు చెందిన రవికుమార్ 2024లో అక్రమంగా మందుగుండు సామగ్రి తయారు చేస్తూ పోలీసులకు చిక్కాడు. అతనిపై కేసు నమోదు చేసి, జైలుకు పంపారు. జైలు నుంచి విడుదలయ్యాక కొంత కాలం ఆటో నడుపుతూ జీవనం సాగిస్తూ వచ్చాడు. ఆ సంపాదన కుటుంబ పోషణకు చాలకపోవడంతో మళ్లీ మందు గుండు సామగ్రి తయారీకి సిద్ధమయ్యాడు. ఐదు రోజుల నుంచి రహస్యంగా తయారీ కొనసాగిస్తున్నట్లు తెలిసిందని ఎస్ఐ తెలిపారు. పోలీసులు జరిపిన దాడిలో అక్రమంగా నిల్వ చేసిన సురేకారం, చార్కోల్, సున్నం, పీవీసీ మందు, తారా జువ్వలు, బెల్ట్ బాంబులు, డ్రిల్లింగ్ మిషన్, ప్రెస్సింగ్ మిషన్, భారీ మొత్తంలో మందుగుండు ముడి పదార్థాలు, తయారీ పరికరాలను స్వాధీనం చేసుకున్నట్లు పేర్కొన్నారు. నిందుతుడిని అరెస్టు చేసి కోర్టులో హాజరుపర్చగా 15 రోజులు రిమాండ్ విధించినట్లు ఎస్ఐ భాస్కరరావు వెల్లడించారు.

కాలువల్లేక రోడ్డుపైనే మురుగు



మురికి కూపంగా మారిన మూలస్వయంభూవరం రోడ్డు

పరవాడ: మండలంలో కలపాక శివారు మూలస్వయంభూవరం గ్రామంలో మురుగు కాలువలు ఏర్పాటు చేయని కారణంగా గ్రామ ప్రధాన రహదారి మురికి కూపంగా మారింది. గ్రామస్తుల వాడుక నీరు రోడ్డు మీదకు చేరి గుంతల్లో నిలిచిపోతోంది. దీంతో రహదారి ప్రయాణికులు ఇబ్బందులు పడుతున్నారు. గ్రామంలో వీధి కాలువలు నిర్మించడానికి పంచాయతీ పాలకవర్గం కనీస చర్యలు చేపట్టలేదని స్థానికులు ఆరోపిస్తున్నారు. వాడుక నీరు పోవడానికి మార్గం లేక వృథా నీరంతా రోడ్డుపై నిలిచిపోతోందని పేర్కొంటున్నారు. ఇప్పటికైనా పంచాయతీ పాలకవర్గం స్పందించి మురుగునీరు పోవడానికి వీలుగా కాలువ నిర్మాణం చేపట్టాలని కోరుతున్నారు.